

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-కదిరి టౌన్


వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

కదిరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పేదలు ఇళ్ల స్థలాల కోసం 4 నెలల క్రితం సచివాలయం, తహశీల్దార్, ఆర్డీవోలకు అర్జీలు పెట్టుకున్నారని, వారికి కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని 720 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హులందరికీ ఇంటి స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జివిఎల్.నరసింహులు, నాయకులు బాబ్‌జాన్, ముస్తాక్, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, ఉదయ్, నారాయణ, మహిళలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి రాజకీయ అంశం మళ్లీ తెరపైకి వస్తోంది. ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారా అనే చర్చ జోరుగా నడుస్తోంది.

ఇటీవల కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వరుస పర్యటనల నేపథ్యంలో ఆయన మరోమారు ఇక్కడి నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నారా అన్న సంకేతాలు విన్పిస్తున్నాయి.

తెరపైకి రఘువీరా..!

- మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నారంటూ ప్రచారం
- కళ్యాణదుర్గంలో వరుస పర్యటనలు
- 2029లో పోటీలో ఉంటారంటూ ప్రచారం
- నియోజకవర్గంలో సర్వత్రా చర్చ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

2009లో నియోజకవర్గాల పునర్ విభజన తర్వాత రఘువీరా కళ్యాణదుర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. రాష్ట్ర విభజన ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో 2019లో మరోమారు ఇక్కడి నుంచే పోటీచేసి రఘువీరా ఓడిపోయారు. అనంతరం ఆయన తన స్వగ్రామం మడకశిర నియోజకవర్గం నీలకంఠాపురానికి పరిమిత్తం అయ్యారు. కొన్నేళ్ల పాటు కళ్యాణదుర్గం వైపు కన్నెత్తి చూడలేదు. జిల్లానే కాదు రాష్ట్ర రాజకీయాలకూ దూరంగా ఉంటూ వచ్చారు. సుమారు ఆరేళ్ల తర్వాత ఆయన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వరుస పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మళ్లీ కళ్యాణదుర్గం నుంచి రాజకీయాన్ని ప్రారంభిస్తారా అన్న చర్చ జోరుగా నడుస్తోంది.

సేవ్ ఆర్డీటీ పాదయాత్రకు సంఘీభావం

ఈ నెల 15వ తేదీ మాజీ ఎంపి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రంగయ్య 'సేవ్ ఆర్డీటీ' పేరుతో చేపట్టిన పాదయాత్రలో రఘువీరారెడ్డి పాల్గొన్నారు. గతంలో పలుమార్లు ఆయన ఇతర పార్టీల్లో చేరతారని ప్రచారం జరిగినా ఖండించారు. ఇంకా చెప్పాలంటే వైసిపి పేరు ఎత్తకుండానే జగన్ పార్టీ అంటూ వ్యంగస్త్రాలు సంధించారు. ఇలాంటి పరిస్థితుల్లో రంగయ్య చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్రకు మండలంలోని బాలవెంకటాపురం గ్రామం వద్ద సంఘీభావం తెలిపారు. ఆర్‌డిటిని కాపాడుకోవాలని చెబుతూనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు బాధ్యత గల పౌరులంతా ఆర్డీటీ కోసం పోరాడాలంటూ ప్రసంగం చేశారు. ఇక ఆదివారం నాడు కుందుర్పిలో జరిగే కామ్రేడ్ లక్ష్మన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలోనూ రఘువీరా పాల్గొననున్నారు.

మరోమారు దుర్గం నుంచి పోటీ చేస్తారా..?

2019 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి ఒడిపోయిన ఆయన తర్వాత రాజకీయాలకు బ్రేక్ ఇచ్చారు. సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో 'నేను ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేశాను.. ఈ నియోజకవర్గ ప్రజలు మంచివారు.. ఎంతో విశ్వాసపాత్రులు.. వారికి మంచిచేయడం తప్ప మోసగించడం రాదు..' అంటూ నియోజకవర్గ ప్రజలను పొగిడారు. ఈ వాఖ్యలు కళ్యాణదుర్గం నుంచి ఆయన మరోమారు పోటీ చేసే ఆలోచనలో ఉంటి చేసినవే అంటూ రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అభివృద్ధిలో రఘువీరారెడ్డి మార్క్

2009లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన రఘువీరారెడ్డి, మంత్రిగా ఐదేళ్ల పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేసి చెరగని ముద్ర వేసుకున్నారు. బళ్లారి-తుముకూరు రైల్వేలైన్, కళ్యాణదుర్గం పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు, కెజిబివిలు, మోడల్ పాఠశాలలు, పాలటెక్నిక్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, తిమ్మసముద్రంలో పరిశ్రమ ఏర్పాటుకు వెయ్యి ఎకరాల భూసేకరణ, రెవెన్యూ డివిజన్, సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కార్యాలయాలతో పాటు బిటిపి ప్రాజెక్టుకు డిఆర్‌పిల తయారీ, గ్రామీణ రోడ్లు, వివిధ భవనాలు, విద్యుత్ ఈఈ కార్యాలయం, నూతన రెసిడెన్సియల్ పాఠశాలలు మంజూరు చేయించారు. 11 ఏళ్ల క్రితం 2 వేల కోట్లకు పైగా నిధులతో ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేశారనడంలో అతిశయోక్తి లేదు.

అధికార, ప్రతిపక్షాల్లోనూ చర్చ

నియోజకవర్గంలో రఘువీరారెడ్డి వరుస పర్యటనల నేపథ్యంలో టిడిపి, వైసిపి ముఖ్యనాయకులు సైతం ఆయన గురించి చర్చించుకుంటున్నారు. ఒక వేళ రఘువీరా మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లో పూర్తి స్థాయిలో దిగితే కళ్యాణదుర్గం నుంచి 2029లో కాంగ్రెస్ తరపున పోటీచేస్తారా లేదా అప్పటి పరిస్థితులను బట్టి వైసిపితో పొత్తులో పోటీ చేస్తారా.. లేక మరేదైనా నిర్ణయం ఉంటుందా అనే చర్చ జరుగుతోంది.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

జాకీ స్థానంలో రేమండ్ పరిశ్రమ

రూ.330 కోట్ల పెట్టుబడులు.. 3 వేల మందికి ఉపాధి

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు నియోజకవర్గానికి ప్రఖ్యాత గార్మెంట్స్ పరిశ్రమ రేమండ్ సంస్థ రాబోతోందని, గతంలో జాకీ పరిశ్రమ వచ్చిన ప్రాంతంలోనే ఇది ఏర్పాటు కాబోతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలియజేశారు. అనంతపురం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ప్రఖ్యాత రేమండ్ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. రాప్తాడు దగ్గర 26.87 ఎకరాలను ఎకరా రూ.20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రూ.330 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు అయ్యే ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాప్తాడు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని చర్యలూ తీసుకుంటున్నారని తెలియజేశారు. త్వరలోనే పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించే పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఈ-స్టాంపు ట్యాంపరింగ్‌లో ముగ్గురు అరెస్టు

వార్త మెయిన్‌లో


మాట్లాడుతున్న రాజశేఖర్

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

తప్పులు చేసి కారాగారాల్లో ఉన్న రిమాండ్ ఖైదీలకు ఆర్థిక స్తోమత లేకపోతే అలాంటి వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని న్యాయాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదులను ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలకు అర్హత ఉంటే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. జైలు నుంచి బయట వెళ్లిన తర్వాత మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం జైలు గదులు, వంటగది పరిశీలించి ఆహార పదార్థాల తయారీ కోసం ఉపయోగించే నిత్యావసరాల వినియోగంపై ఉప కారాగార అధికారి హనుమప్పను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నెరప్ప, న్యాయవాదులు శివశంకర్, సుధాకర్, సందీప్, లోక్‌అదాలత్ హేమావతి పాల్గొన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ కోర్సులు

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి తెలిపారు. జూలై 2వ తేదీ బుధవారం నుంచి ఈ తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగుతాయని చెప్పారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, కోర్సులు ఉచితంగా ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 6303432820, 9959224585 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

కర్నాటక మద్యం నియంత్రణకు చర్యలు

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి-హిందూపురం

కర్నాటక మద్యం రాష్ట్రంలోకి రాకుండా నియంత్రించే చర్యలను పూర్తి స్థాయిలో చేపట్టాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను తనఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను, మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలు తదితర వాటి వివరాలు తెలుసుకున్నారు. కల్లు దుకాణాల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపించాలని సూచించారు. కర్ణాటక రాష్ట్ర మద్యం అక్రమ రవాణాదారుల మీద కేసులు నమోదు చేయాలన్నారు. ఎంఆర్‌పి ధరలకు మించి మద్యం విక్రయాలు జరిపితే వారిపై కేసులను నమోదు చేయాలన్నారు. బెల్టు షాపులు నిర్వహించే వారు ఎంతటి వారైన వారిపైనా కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్ పోస్టును తనిఖీ చేశారు. సిబ్బంది చెక్ పోస్టుకు సరిగా విధులకు హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ ఎన్.లక్ష్మి దుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న నాగమద్దయ్య

జగన్‌వన్నీ కుట్ర రాజకీయాలే..!

ఆయన మాయలో వైసిపి కార్యకర్తలు పడొద్దు

రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకుంటూ అడుగడుగునా అవరోధాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న జగన్ రెడ్డి క్షుద్ర రాజకీయాలకు ఆ పార్టీ కార్యకర్తలు బలికావొద్దని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శనివారం నాడు పెనుకొండ పట్టణంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలూ పని చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి జగన్ రెడ్డి ఓర్వలేకపోతున్నాడన్నారు. ప్రజల్లో ఉనికిని కోల్పోతున్నానన్న భయంతో కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు తెర తీశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ మీడియాలో రపా...రపా...అని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసీపీలో ఉన్న యువకులు, కార్యకర్తలను తప్పుడు ప్రచారాలతో జగన్ రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శవ రాజకీయాల చేయడం ఆయనకు అలవాటు మారిందన్నారు. వైసీపీ కార్యకర్త జగన్ కారు కిందే పడి ప్రాణం కోల్పోయినా మానవత్వం లేకుండా రోడ్డు పక్కకు ఈడ్చి పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన మాటలు వింటే నష్టపోయేది వైసీపీ కార్యకర్తలేనన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే కార్మికుల సత్తా చూపిస్తాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ.శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం


నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ.శ్రీనివాసులు


ధర్మవరంలో మాట్లాడుతున్న జెవి.రమణ

పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారించకుంటే ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో చూపిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెడ్పీ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలో ప్రధాన రహదారుల గుండా వందలాది మంది పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు పారిశుధ్య కార్మికులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమల్లో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. సమస్యలను పరిష్కరించక పోగ, కార్మికులకు ఉద్యోగ భద్రత ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేయాలని చూడడం దుర్మార్గం అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అందరినీ రెగ్యులరైజ్ చేసి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను వర్తింజేయాలన్నారు. ఇటీవల మున్సిపాలిటీలలో పనిచేస్తూ మతి చెందిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మృతుల కుటుంబం ఆదుకునేందుకు ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలు ఇవ్వాలన్నారు. కార్మికుల విధులకు అవసరం అయ్యే పనిముట్లను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, సహాయ కార్యదర్శి రామచంద్ర, నాయకులు మూర్తి, శంకర్, రామాంజనప్ప, బాబయ్య, మహిళా నాయకురాలు కవితమ్మ, గంగ రత్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఇంజినీరింగ్ కార్మికుల రిలే దీక్షలు

ధర్మవరం రూరల్ : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పట్టణంలో చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజైన శనివారం కొనసాగాయి. దీక్షా శిబిరంలో సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్ టి.అయూబ్‌ఖాన్, అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయకృష్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం, జీవో-36, సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగ భద్రత, చనిపోయిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రిస్క్,హెల్త్ అలవెన్స్ వర్తింపు, వేతనం పెంపు, పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్య పెంపు, తదితర సమస్యల పరిష్కారం కోసం ఎంతో కాలంగా పోరాటాలు చేస్తున్నామన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిచో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. వీరి దీక్షలకు మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. శిబిరంలో ఎం.బాబు, చెన్నకేశవులు, వెంకటేష్, శ్రీనివాసులు, రమేష్, అనిల్‌కుమార్, యోగి, కాటమయ్య, దస్తగిరి, లింగమయ్య, హరి, తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

గ్రామపంచాయతీ కార్యదర్శులకు విపరీతమైన పని భారాలు పెడుతున్నారని, తక్షణమే వాటిని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.విశ్వనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులందరూ కలెక్టరేట్ వద్ద ప్ల కార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ డేటా ప్రకారం పారిశుధ్య పనులపై రోజూ ఉదయం 6 గంటలకే ఫొటో తీసి పెట్టాలన్న నిబంధన వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనికి తోడు ఇతర పనులు కూడా అప్పచెబుతుండటంతో పని భారంతో సతమతమవుతున్నామన్నారు. ట్రై సైకిళ్ల ద్వారా పని చేయాలంటే పారిశుధ్య కార్మికులకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఒక్కో పంచాయతీలో మజారా గ్రామాలు ఉండటం వల్ల కుటుంబాలను బట్టి ఒక క్లాప్ మిత్రను నియమించి వారికి సరైన వేతనం ఇవ్వాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకూ పని వేళలు మార్చాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాల సిబ్బంది అందరిపైనా ఆజమాయిషీ అధికారం బాధ్యతలు ఇవ్వాలని కోరారు. గ్రామపంచాయతీలో పని చేస్తున్న ఇంజినీరింగ్, పారిశుధ్యం, పిడబ్ల్యుఎస్, స్కీంలలో పాల్గొనేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అనంతరం డిఆర్‌ఓ విజయసారథికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రావణ్‌కుమార్, రామ్మోహన్, సురేంద్ర, రాజేష్, సావిత్రి, మమత, తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌జిఒ పార్కును శుభ్రం చేస్తున్న చైర్మన్, సీనియర్ నాయకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

హిందూపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో లేఅవుట్ పార్క్‌లో తెలుగుదేశం యువత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ సేవా - స్వచ్ఛ హిందూపురంలో మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులతో కలిసి పలుగు, పారపట్టి పార్కును శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్జీవో లేఅవుట్‌లో నివసిస్తున్న ప్రజలు తమ ఇంటిలో ఉన్న చెత్తను కాలువలలో వేయడం వల్ల కాలువ నీరు అక్కడిక్కడే నిలిచిపోయి ప్రజలు అనారోగ్యం పాలవతారని పేర్కొన్నారు. చెత్తబండికి చెత్తను ఇస్తే వారు డంపింగ్‌యార్డుకు తరలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దుర్గా మంజుల, రాఘవేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, వార్డు ఇన్‌ఛార్జి ఆంజనేయులు, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సోమందేపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీ చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సాయిబాబా ఆలయంలో శనివారం అంగన్వాడీ యూనియన్ నాయకురాలు శ్రీదేవి అధ్యక్షతన మండల సిఐటియు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ టియు జిల్లా కోశాధికారి బి.సాంబశివ మాట్లాడుతూ కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు మేలు చేసేలా 4 లేబర్ కోడ్స్‌గా మార్చడం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేయ డమే అన్నారు. 8 గంటల పని విధానం రద్దు చేసి 10, 12 గంటలకు పెంచడం, మహిళలు రాత్రి పూట కూడా పనులు చేయాలని పేర్కొనడం దుర్మార్గం అన్నారు. వీటికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మంత్రి వర్గంలో తీర్మానం చేయడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం సిఐటియు మండల నూతన కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా శ్రీదేవి, కో కన్వీనర్లుగా గాయత్రి, నాగభూషణతో పాటు 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, రవి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మల్లిక, రజియా, భారతి, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ప్రతిభ, వేదవతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో బిఎస్ఆర్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్


హెచ్‌ఎం మేరీ వరకుమారి

పట్టణంలోని బిఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో సత్తా చాటారని శనివారం హెచ్ఎం మేరీ వరకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. అందులో వై.చైతన్యప్రసాద్-139, పి.జస్వంత్-131 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులు అందుకు సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి ఛైర్మన్, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ 13 మందికి కేంద్ర ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకూ ఏటా రూ. 15వేల చొప్పున అందజేస్తుందన్నారు.

'ఆశా' పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డిఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూరల్‌లో 40, అర్బన్‌లో ఐదు పోస్టులకు ఈ నెల 30 నుంచి జులై 4వ తేదీ వరకూ సంబంధిత పిహెచ్‌సి, లేదా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పిహెచ్‌సి, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను సంప్రదించాలన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గుడిబండ

ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శనివారం ఎస్ఎఫ్ఐ నాయ కులు తిప్పేష్, వినోద్ డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగ వసతి గృహాల్లో మరమ్మతులు చేయాలని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వార్డెన్ల అవినీతి, అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కొందరు వార్డెన్లు హాస్టల్లోనే విద్యార్థుల ముందు మద్యం తాగుతున్నారని, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపించారు. అలాంటి వార్డెన్లపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో ఎక్కడికక్కడ ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షిక పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రతినిధులు

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

అరవి ప్రో అకాడమీ సీఈవో అర్జున్ వరదరాజు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అరవి ప్రో అకాడమీ సీఈవో అర్జున్ వరదరాజు, ఎల్‌ఆర్‌జి విద్యా సంస్థల డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామ్మూర్తిలు విద్యార్థులకు సూచించారు. హిందూపురం కిరికెరలోని ఎల్‌ఆర్‌జి పబ్లిక్ పాఠశాలలో శనివారం విద్యార్థి నాయకత్వ బాధ్యతలను స్వీకరించే వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి అరవి ప్రో అకాడమీ సీఈఓ అర్జున్ వరదరాజు, డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామ్మూర్తిలు పాల్గొన్నారు. ఈ వేడుకలో భాగంగా కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు తొడిగి, వారికి బాధ్యతలను అప్పగించారు. పాఠశాల వార్షిక పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయకుడంటే నాయకత్వ లక్షణాలతో కాక ఇతరులు చెప్పే సమస్యలను కూడా విని పరిష్కరించాలని సూచించారు. పాఠశాల కార్యదర్శి బాల సుందరం మాట్లాడుతూ నూతన పాఠశాలలో సాంకేతిక బోధనతో పాటు ముఖ్యంగా విశాల రసాయన, భౌతిక ప్రయోగశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టిబి.భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాన్యూస్ ఛానల్‌పై దాడి దుర్మార్గం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

హైదరాబాద్ నగరంలో మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని, ఆ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు, మీడియా ఛానళ్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మీడియాలో వచ్చే కథనాలపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత వ్యక్తులు మీడియా ద్వారా ఖండించాలే తప్ప ఇలా దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరకరమైన అంశాలు ఉంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించాలి, తప్ప మీడియా కార్యాలయాలపై దాడికి దిగడం సరైంది కాదన్నారు. ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. దాడి చేసిన వ్యక్తులపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, మరో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

వితంతు పెన్షనర్ల నవీకరణ ప్రక్రియ చేపట్టాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 2019 నవంబర్ నుంచి 2023 నవంబర్ మధ్య కాలంలో మృతిచెందిన పురుష పెన్షనర్ల భార్యల వివరాలను నవీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నూతన మొబైల్ యాప్ వెర్షన్‌ను విడుదల చేసిందని ఎంపిడిఒ సాయిమనోహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నవీకరణ కార్యక్రమాన్ని అత్యవసరంగా చేపట్టి మూడు రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి అర్హత ఉన్న మరణించిన పెన్షనర్ల భార్యలు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

6న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం రూరల్ : నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు, యువర్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జులై 6వ తేదీ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత ఐఒఎల్ కంటి వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు, కౌన్సిలర్ కేతా లోకేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని స్వాతి క్లినిక్‌లో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్క రించారు. శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ చికిత్స అందిస్తారని తెలి పారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ శీలా నాగేంద్ర, సెక్రటరీ ఆర్.జయరాం, ట్రెజరర్ వంకదారి మోహన్, క్యాంపు ఛైర్మన్ ఎస్.చాంద్ బాషా, పూజారి వెంకటరాముడు, పూజారి లక్ష్మీదేవి జ్ఞాపకార్థం వారి కుటుం బ సభ్యులు పూజారి జగదీష్, పిఆర్‌ఒ సి.రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ రమేష్‌బాబు, స్టార్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో టిడిపి బలోపేతానికే వార్డు కమిటీలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో టిడిపిని బలోపేతం చేయడం కోసమే పట్టణంలోని 40 వార్డుల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు పరిసే సుధాకర్, మాధవరెడ్డి, కాటమయ్య, పురుషోత్తంగౌడ్ తెలిపారు. వారు శనివారం పలు వార్డులకు నూతన కమిటీల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ నూతన వార్డు కమిటీలు నిరంతరం ప్రజల కు అందుబాటులో ఉండాలని, ఎలాంటి సమస్యనైనా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేలా కృషి చేయాలని సూచించారు. వార్డు కమిటీల్లో పదవులు రాని వారు బాధ పడొద్దని, పట్టణ కమిటీ, పట్టణ పార్టీ అనుబంధ కమిటీల్లో చోటు కల్పిస్తామని తెలిపారు. వార్డుల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భీమినేని ప్రసాద్, రహీం బాషా, బాబూఖాన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వింతైన తలతో దూడ జననం



వింతైన తలతో జన్మించిన దూడ

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని చాగలేరు గ్రామంలో నేసే ఆదెప్పకు చెందిన ఆవు శనివారం తల వింతగా పెద్దగా ఉండే దూడకు జన్మనిచ్చింది. తల అధిక పరిమాణంలో ఉండడంతో పాటు దవడ సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల దూడ పాలు తాగడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పశు వైద్యుడు మాట్లాడుతూ ఇది జన్యు లోపం వల్ల జరిగిందని, ఈ దశలో పాలు తాగలేకపోవడం, మేత మేయలేకపోవడం కారణంగా దూడ బతకడం కూడా కష్టమేనని తెలిపారు.

పెనుకొండ రూపురేఖలు మారుస్తాం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పట్టణ రూపురేఖలు మారుస్తామని మంత్రి సవిత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట రూ. 62 లక్షలతో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్ నిర్మాణానికి శనివారం మంత్రి సవిత ఎంపి.బికె పార్థసారథితో కలిసి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ. వంద కోట్లతో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. రూ. 5 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని, రూ. 2 కోట్లతో పెనుకొండ ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు పరికరాలు అందజేస్తామని, రూ. 1.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెనుకొండ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదిలోనే గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని పెనుకొండ పట్టణంలో చేపట్టామన్నారు. ఇప్పటికే బైపాస్ రోడ్డును నిర్మించామని, కొనాపురం రోడ్డుకు భూమి పూజ చేశామన్నారు. బిసి కాలేజీ మంజూరు చేయించామన్నారు. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి నిర్మించిన విద్యుత్ పోల్ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. రూ. 6 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు. నూతన ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రూ. 16 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ సిటీ పనులకు త్వరలో భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా మూడేళ్లగా సొంత నిధులతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నానని తెలిపారు. ఎంపీ బికె. పార్థసారథి మాట్లాడుతూ పిచ్చి తుగ్లక్ జగన్ పాలనలో రాష్ట్రం నాశనమైందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఎపి అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. జగన్ అమరావతి, పోలవరంను సర్వనాశనం చేస్తే చంద్రబాబు వాటిని పునర్నిర్మాణం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనందకుమార్, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహారావు, తహశీల్దార్ శ్రీధర్, రాష్ట్ర యాదవ, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, డివి.ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వర్‌ప్రసాద్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ



మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో ఎంపీ పార్థసారథి

ఇటుక బట్టి నిర్వాహకులను ఆదుకోవాలని వినతి

పరిగి : ఇటుకల బట్టీలకు ఉచితంగా మట్టి తరలించుకునేలా ప్రభుత్వ అనుమతి ఇవ్వాలని కోరుతూ నిర్వాహకులు శనివారం మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఇటుక బట్టీలకు చెరువు నుంచి మట్టి తరలింపుపై మంత్రిని కలిసి వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డిఎస్‌ఎల్ శ్రీనివాసులు, లోకేష్, హనుమయ్య ఉన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ సూచించారు. హిందూపురం మండల పరిధిలోని మలగూరు పంచాయతీ నందమూరి నగర్ ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ నిర్దిష్టమైన హక్కులు, బాధ్యతలను కల్పించిందన్నారు. 14 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలందరూ తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



హిందూపురం : గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్

అంటరానితనాన్ని రూపుమాపుదాం

బుక్కపట్నం : అంటరానితనాన్ని రూపుమాపి అంటరానితనం లేని సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, ఎఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మండలం లోని సిద్దరాంపురం గ్రామ అంబేద్కర్ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించి, రెండు గ్లాసుల పద్ధతిని విడనాడాలన్నారు. చట్టాలు, బాల్యవివాహాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిఎంసి మెంబర్ రామాంజనేయులు, వీఆర్వోలు వేణుగోపాల్, పెద్దన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలోని కొక్కంటి పంచాయతీ పరిధిలోని గీతాలవారిపల్లిలో తహశీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ వివిధ చట్టాలు, అంటరానితనం నిర్మూలన, పౌర హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అశోక్, వీఆర్వో గంగాద్రి, పోలీసులు వెంకటేష్, కిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి



పాఠశాల ముందు రోడ్డు దాటుతున్న విద్యార్థులు

స్థానిక జడ్పీ హై స్కూల్ ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం ఎస్ఎంసి ఛైర్మన్ హరి ఎంపిడిఒ బాలకృష్ణుడుకి వినతి పత్రం అందజేశారు. అనంతరం హరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల ముందు ఉన్న రహదారిపై నిత్యం వాహనాలు అతివేగంగా రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. దీంతో విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి పాఠశాల ముందు రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎంపిడిఒ తొందరలోనే స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

ఆశా వర్కర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి : బత్తలపల్లి పిహెచ్‌సి పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులకు జులై 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మాల్యవంతం చెర్లోపల్లి, ఓబుళాపురం స్థానాలు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

మోహన్ ట్రేడర్స్ యజమానికి పరామర్శ

బత్తలపల్లి : స్థానిక మోహన్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో గత గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి భారీగా ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే. దీంతో శనివారం జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆయన స్వగ్రామం వెళ్లి బాధితుడు మోహన్‌రెడ్డిని పరామర్శించారు. అధైర్యపడొద్దని ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఆయన షాపును పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షులు పుర్రంశెట్టి రవి, సంజీవరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమణా రెడ్డి, బెస్త శ్రీనివాసులు, డిష్ రాజు, వెంకటస్వామి, గంగాధర్ ఉన్నారు.

టిడిపి కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

నల్లమాడ: టిడిపి మండల, అనుబంధ కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కన్వీనర్ మైలే శంకర తెలిపారు. నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మంజూరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కన్వీనర్ మాట్లాడుతూ ఇటీవలే గ్రామ కమిటీలను పూర్తి చేశామన్నారు. కమిటీల ద్వారా ఎన్నికైన నాయకులు జూలై 2వ తేదీ నుంచి డోర్ టు డోర్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటారన్నారు. వారితో పాటు నాయకులు కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలు ప్రజలకు వివరిస్తారన్నారు. జోనల్ ఇన్‌ఛార్జి నరసింహులు మాట్లాడుతూ నూతన కమిటీల సభ్యులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కొట్లో మంజూరెడ్డి, ఎం.రవికుమార్, మహేంద్ర నాయక్, బికె.మంజునాథరెడ్డి, డి.హనుమంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్



అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం శుభ పరిణామని, అయితే త్వరగా సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. పట్టణంలోని ఎన్జీవోస్ ఫంక్షన్ హాలులో శనివారం నియోజకవర్గ అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఇందులో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉమ్మడి అనంతపురం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బి.నారాయణప్ప పాల్గొన్నారు. తిరుపతిరావు మాట్లాడుతూ మన పోరాటాల ఫలితంగా కూటమి ప్రభుత్వంలో చర్యలు ప్రారంభించడం హర్షణీయమన్నారు. అయితే ఇకపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే మరోమారు ఏకమై పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయకుండా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.లియాకత్‌అలీ, డివిజన్ కార్యదర్శి పవన్, 24 మంది అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

జయానందరెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



డాక్టరేట్ అందుకుంటున్న జయానందరెడ్డి

పాత్రికేయ వృత్తితో పాటు సామాజిక సేవలందించిన జయానందరెడ్డికి తమిళనాడులోని ఏషియన్ ఇంటర్నేషనల్ అకాడమీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పట్టణంలోని యూనివర్సిటీ వారు నేను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. ఈ డాక్టరేట్ వల్ల సంతోషంగా ఉందని భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. పాత్రికేయ వృత్తితో పాటు తన శక్తి కొలదీ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ఎక్కువగా చేపట్టాల్సిన బాధ్యత ఏర్పడిందన్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల పలువురు పాత్రికేయులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

రోడ్డు పనుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న రావికుంట వరకూ జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులను శనివారం మండల టిడిపి నాయకులు పరిశీలించారు. వారిలో మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నరేష్, ఉత్తమరెడ్డి, అజమతుల్లా, పసుపులేటి శ్రీనివాసులు, ఉమర్‌ఖాన్, మహేంద్ర, నిమ్మల శ్రీధర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-బత్తలపల్లి



నారాయణస్వామి (ఫైల్‌ఫోటో)

మండలంలోని రామాపురంలో శనివారం సాయంకాలం ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామాపురం గ్రామానికి చెందిన కప్పల ఆదినారాయణ కుమారుడు కప్పల నారాయణస్వామి(22) అలియాస్ చీందు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆర్‌డిటి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియ రాలేదు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి బైపాస్‌లో వేల్పుమడుగు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిమర్రి మండలంలోని మద్దిరేకలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ తన మామతో కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని వేల్పుమడుగు గ్రామం వెళ్లారు. తిరిగి స్వగ్రామం వస్తూ వేల్పు మడుగు గ్రామానికి చెందిన వెంగముణిని బైక్‌లో ఎక్కించుకున్నారు. వీరు బత్తలపల్లి బైపాస్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అనంతపురం నుంచి తంబళ్లపల్లికి వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లేష్, వెంగముణి తీవ్రంగా గాయపడగా అదే కారులో ఆర్‌డిటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కారులో ఉన్న రెండేళ్ల చిన్నారికి స్వల్పగాయాలు కాగా నడుపుతున్న రమేష్‌రెడ్డి, అతని భార్య క్షేమంగా బయటపడ్డారు. వెంగముణిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మిస్సింగ్.. కేసు నమోదు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళ ఈ నెల 17వ తేదీ నుంచి కొడుకుతో సహా కనిపించడంలేదని ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. సదాశివ భార్య శివకాంత స్వగ్రామం గుమ్మలకుంట. వీరు ప్రస్తుతం స్థానిక టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల రిషి సంతానం. సదాశివ కూలి పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 17వ తేదీ ఉదయం పనికి వెళ్లాడు. ఆ సమయంలో శివకాంత భర్తకు ఫోన్ చేసి కొడుకుతో పాటు తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామంలో వెలసిన ఓసూరమ్మస్వామి ఆలయానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. అప్పగినుంచి తిరిగి ఇంటికి రాలేదన్నారు. వారి కోసం చుట్టుపక్కల గ్రామాలు, బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో విచారించినా ఆచూకీ తెలియ లేదన్నారు. దీంతో శనివారం శివకాంత తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-తాడిమర్రి



నాగార్జునను సన్మానిస్తున్న కోటి సూర్య ప్రకాష్‌బాబు

ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మండలంలోని చిన్న కొండయ్యపల్లి గ్రామానికి చెందిన కొంకా నాగార్జునను నియమించిన విషయం తెలిసిందే. నాగార్జున ఇటీవలే ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ క్రమం లో శనివారం కురుబ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు నాగార్జున ను మర్యాదపూర్వకంగా తన ఇంటికి ఆహ్వానించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కురుబ యువత వర్కింగ్ ప్రెసిడెంట్ కప్పల సుదర్శన్, కురుబ కులస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచికు ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం



హనుమంత రాయుడును పరామర్శిస్తున్న మంత్రి

మండలంలోని ఆర్.లోచర్ల పంచాయతీ మాజీ సర్పంచి హనుమంత రాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సవిత శనివారం ఆసుపత్రికి వెళ్లి అతడిని పరామ ర్శించి రూ. 60 వేలు అందజేశారు. మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఆమె వెంట టిడిపి సీనియర్ నాయకులు మాధవ నాయుడు ఉన్నారు. అలాగే టిడిపి పంచాయతీ కన్వీనర్ మురళి, డీలర్లు ముత్యాలప్ప, రామాంజనేయులు, నాయకులు జల్లి అంజనప్ప, నరసింహప్ప, అనిల్‌కుమార్, రాజగోపాల్, హనుమం తప్ప, రామన్న, కొత్తూరు రామంజి, చిలకల రామంజి, హనుమంతప్ప, టైలర్ నాగరాజు, ఆసుపత్రికి వెళ్లి హనుమంతురాయుడును పరామర్శించారు.

కాకతీయ విద్యానికేతన్‌లో ఘనంగా గ్రీన్ డే

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శనివారం గ్రీన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఆకుపచ్చ రంగుతో కూడిన దుస్తులు ధరించి, అదే రంగులో ఉన్న వస్తువులతో పాఠశాలకు హాజరయ్యారు. కరస్పాండెంట్ నిర్మలాదేవి మాట్లాడుతూ ప్రకృతిలో ఆకుపచ్చ రంగు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. అలాగే విద్యార్థులకు రంగుల పట్ల అవగాహన కల్పించారు. ఆకుపచ్చ రంగు విశిష్టతను తెలిపారు. ఆకుపచ్చ రంగులో ఉన్న కూరగాయలు, పండ్లు గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల చేత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని మరింత పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్ రెడ్డి ,శెట్టిపి పద్మ, ఉపాధ్యాయ బందం, తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కండిషన్ లేని పాఠశాల బస్సులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం



ఆర్‌టిఒ కార్యలయంలో అధికారికి వినతిని ఇస్తున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

సరైన కండీషన్ లేకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ప్రాంతీయ రవాణా కార్యాలయ పరిపాలనాధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌ఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కదిరిష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు బాబావలి, యుఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ పరిమితికి మించి బస్సులలో విద్యార్థులను తరలిస్తున్నారని చెప్పారు. కాలం చెల్లిన బస్సులతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు స్పందించి అలాంటి బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నరసింహులు బాధ్యతల స్వీకరణ

బుక్కపట్నం : మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నరసింహులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న షాబుద్దీన్ తనకల్లుకు బదిలీ అయ్యారు. దీంతో ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న నరసింహులును ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యాలయ సిబ్బంది సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయనను మండల టిడిపి నాయకులు, స్టోర్ డీలర్లు సన్మానించారు.



తహశీల్దార్ నరసింహులును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అంతటా బదిలీల సందడి..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అంతటా అదే సందడి నెలకొంది. ఇప్పటికే జిల్లా అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. ఇప్పుడు తక్కిన ఉద్యోగుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయ బదిలీల్లో అంతటా అయోమయం, గందరగోళం కొనసాగింది. వాటిని సరిచేసే ప్రక్రియను అధికారులు చేపడుతు న్నారు. ఇక సచివాలయ ఉద్యోగ బదిలీలకు కౌన్సిలింగ్ నడుస్తున్నాయి. అన్ని శాఖల్లో బదిలీలు నడుస్తుండటంతో అంతటా అదే హడావుడి నెలకొంది. ఇక ఈ బదిలీల్లో తాము అనుకున్న స్థానాలకు బదిలీ అయ్యేందుకు ఉద్యోగులు సిఫారసుల కోసం పెద్ద ఎత్తున నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో తాము కోరు కున్న ప్రాంతానికి వెళ్లే ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. కోరుకున్న స్థానం లభించిన వారు ఆనందంలో ఉండగా రాని వారు అసంతృప్తితో ఉన్నారు.

రాజకీయంగా చూసినప్పుడు వైసిపి తమ కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఏడాది పాలనపై వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించిన వైసిపి ఇప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లేందుకు సమయత్తం అవుతోంది. అందులో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న సజ్జల రామ కృష్ణారెడ్డి, రాయలసీమ సమన్వయకర్త అయిన మిథున్‌రెడ్డి అనంతపురం జిల్లాకు విచ్చేశారు. బుక్కరాయసముద్రంలో శింగనమల నియోజకవర్గ కార్యాలయం ప్రారంభమైన తరువాత 'రీకాలింగ్ చంద్రబాబు హామీలు' పేరుతో కార్యక్రమాన్ని రూపొందించి వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ ఎమ్మెల్యేలు వెళ్లాలని నిర్ణయించింది. అంతలోపు రీకాలింగ్ చంద్రబాబు హామీల పేరుతో ప్రభుత్వం ఏడాదిలో చేయని హామీలను ప్రజలకు గుర్తు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, చివరకు గ్రామ స్థాయి వరకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం క్యూఆర్ స్కానర్‌ను పెట్టి ఏడాది వైసిపి ప్రభుత్వం లేకపోవడం వలన కుటుంబానికి ఎంత నష్టం జరిగిందని వివరించే పనిని చేపట్టింది. దీన్ని అధికార టిడిపి ఏ రకంగా తిప్పికొడుతుందో చూడాల్సి ఉంది. వైసిపి చేస్తున్న ప్రధాన ప్రచారంలో అన్నదాత సుఖీభవ ఇవ్వలేదని పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో విడుదల చేస్తామని ముందుగా ప్రకటించింది. కేంద్రంతో కలిపి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అమలు జరగలేదు. ఇక ఇతర హామీల అమలుపైనా వైసిపి చేస్తున్న ప్రచారాన్ని టిడిపి ఏ రకంగా తిప్పికొడుతుందో చూడాల్సి ఉంది.

సిపిఎం ఆధ్వర్యంలో ఈ వారంలో 50 ఏళ్ల ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు నేడు ఉన్నాయంటూ అనంతపురం నగరంలో సభను నిర్వహించింది. ఈ సభకు సిపిఎం సీనియర్ నాయకులు పి. మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. సిపిఐ అనంతపురం నగర మహాసభను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.